

# నా కళ్ళతో నాన్న

**- లిపి మల్లాది**



ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల, వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**అందరి** జీవితంలో ఉండే ముఖ్యభాగాలు - బాగా చదువుకోవడం, ఉద్యోగం సంపాదించడం, పెళ్ళి చేసుకుని పిల్లల్ని కనడం. ఆ ఆఖరి భాగంలో ఎన్నో ఏళ్ళుగా స్థిరపడిపోయిన మా నాన్నని ముందుకి తీసుకెళ్ళింది ఊహ కూతురు నీసా. `తాత` అన్న పిలుపుతో మా నాన్నని మరోభాగానికి చేర్చింది. కేవలం మా ఇంట్లోనేకాక బంధువులు, క్లాస్‌మేట్స్, ఇంటి చుట్టుపక్కలవారందరిలో నేనే చిన్నదాన్ని కావడంతో నాకు పిల్లలతో అనుభవం చాలా తక్కువ. చిల్డ్రెన్ హోంలో పనిచేసినప్పుడు నేను "చుచ్చి కుచ్చి" అని చిటికేసి పిల్లల్ని పిలిచి తలనిమరడం చూసి అక్కడ పనిచేసే ఆవిడ నవ్వారు. కొన్ని రోజులు గడిచాక నేను పిల్లలకి కథలు చెప్పడం చూసి "యూ ఆర్ ఎ నేచురల్" అన్నారు. కానీ అది నిజంకాదు. మా ఇంట్లో వారిలా పిల్లల్ని నేను ఆడించి లాలించలేను. నేను నీసాతో మాట్లాడ్డం చూసి "అదేమైనా సెకండ్ క్లాస్ చదువుతుందనుకుంటున్నావా? చిన్న పిల్లలా మాట్లాడు" అని ఊహ ఎన్నోసార్లు చెప్పింది. మా నాన్న లాలి పాటలు పాడడం నీసా వల్లే చూడగలిగాను.

మా నాన్నగారి అన్నయ్య నన్ను చిన్నప్పుడు బాగా గారాబం చేస్తూ ఆడించేవారు. పిల్లల విషయంలో ఆయనకి ఉన్నంత సహనం నాకు లేదు. ఇప్పుడు దూరం పెరిగినా నా బాల్యం గుర్తొచ్చిన ప్రతిసారి ఆయన్ని మిస్ అవుతుంటాను. "నీసాకి నాతో అలాంటి బంధం ఏర్పడాలంటే ఏం చెయ్యాలి?" అని ఒక రోజు మా బావ లచ్చికి ఫోన్ చేసి అడిగాను.

"నీసా నన్ను చూసి `వామ్మో, మళ్ళీ వచ్చేసింది` అని ఏడవకపోతే చాలు. నువు విరించితో ఏం మాట్లాడతావు? ఎలా ఆడిస్తావు? వాళ్ళకి నడవడంకూడా రాదు. మనం మాట్లాడేది అర్థంకాదు" అన్నాను. నీసా నా వల్ల భయపడదు, నేను పొరపాటున కింద పడేయను, పిల్లలకి ఎవరు ప్రేమిస్తారో ఆడించకపోయినా అర్థమౌతుంది అని ధైర్యం చెప్పాడు.

నేను జీవితంలో చెయ్యననుకున్న ఎన్నోపనులు నీసావల్ల చేసాను. తను పుట్టిన రోజున రెండువందల మైళ్ళు డ్రైవ్ చెయ్యడంతో మొదలు ప్రతీ రోజు ఓ కొత్త అనుభవం. రోజుల పాపని లాలించడం, రాత్రంతా ఎత్తుకుని తిప్పడం, ఎప్పుడు నడుస్తుందా అని ఎదురు

చూడడంలాంటివి నా జీవితంలో ఉంటాయని నేను ఊహించలేదు. "ఈ పిల్ల గొంతు ఎలా ఉంటుందో వినాలని ఉంది. అమ్మ, ఎంత ఏజ్ వచ్చాక పిల్లలు మాట్లాడతారు?", "ఊహ, నీసా మాట్లాడితే రికార్డ్ చేసి పంపు" అని దాదాపు ఏడాదిపాటు ఎదురు చూసాను.

మొదట్లో లిపి అనడం రాక 'ఫీ' అని పిలిచిన ఆ పాప నన్ను మొదటిసారి 'లిపి' అని పిలిచినప్పుడు నా కళ్ళలో తడి ఏర్పడింది. "ఇంత చిన్నపిల్ల లిపి అంటుందేంటి? ఊహ. ఫీ అనే పిలవమను. లిపి అంటే పెద్ద పిల్ల అయిపోయిందనిపిస్తుంది" అని చెప్పాను.

నేను, ఊహ 'నాన్న' అని పిలవడం విని ఓ రోజు నీసా 'తాత' బదులు 'నాన్న' అని పిలిచింది. నేనూ, ఊహ నవ్వుతుండగా "నాన్నకాదు. తాత" అని మా అమ్మ సరిచేసినప్పుడు "ఏం ఫరవాలేదు ఎలా అయినా పిలవనీ. దానిష్టం" అని మా నాన్న మురిపెంగా అన్నారు.

మా అమ్మా, నాన్న ఎప్పుడూ కలిసుంటారు అని నీసాకి తెలుసు. ఊహ ఫేస్‌టైం చేసినప్పుడు మా అమ్మని చూసి "మిమ్మీ వేర్ ఈజ్ తాత" అని అడిగి మా అమ్మ బదులు ఇచ్చేలోపే "తాత తాత" అని గట్టిగా పిలుస్తుంది. "హాయ్ తాత" అన్న తరువాతే "బంగారు తల్లి, చిట్టి తల్లి, వెండికొండ" అంటున్న మా అమ్మ పిలుపులకి స్పందిస్తుంది. మా నాన్న మాట్లాడిన ప్రతీసారి "నీసా, డు యు వాంట్ హేష్ బ్రౌన్? డు యు వాంట్ ఆమ్లెట్? డు యూ వాంట్ చాక్లెట్?" అని అడగడంతో మా నాన్న మర్చిపోయిన ప్రతిసారి "తాత, హేష్ బ్రౌన్, చాక్లెట్, ఆమ్లెట్" అని గుర్తుచేస్తుంది. నేను పెంచకపోయినా రోజూ చూడకపోయినా, నా జీవితంలో నీ స్థానం ఎవ్వరూ చేరలేరు. బహుశా కావ్య నా గురించి ఇలానే అనుకునేదేమో.

కావ్య చిన్నప్పుడు మా నాన్న కావ్యని ఎత్తుకుని 'ఓ మై డార్లింగ్' అంటూ వాల్ట్స్ చేసేవారు. కావ్య నాతో చేసేది. నేను నీసాతో. కానీ, " ఓ మై డార్లింగ్' అన్న పాట నా బాల్యానికి అంకితమవ్వడంతో 'డుడుడుడూ' అని పాడడం కావ్యకి నవ్వు తెప్పించింది. నాకు చెల్లి, తమ్ముళ్ళు లేకపోవడంతో మా అమ్మ, నాన్న పిల్లలతో ఎలా ఉంటారనేది నేను నీసా పుట్టిన తరువాతే తెలుసుకున్నాను. నా చిన్నప్పుడు మా అమ్మలో కనబడిన ఉత్సాహం తిరిగి నీసా పుట్టాకే చూసాను. మూడు కాంటినెంట్స్‌లో ఉంటున్న మా కుటుంబం అంతా ఏళ్ళు గడిచాక ఒక్క గూటికి చేరింది కూడా నీసా వల్లే. ప్రతీ విషయంలో "నాతో కూడా ఇలానే ఉండేవారా? నన్నుకూడా ఇలానే ఆడించేవారా?" అని రోజుకి కనీసం పదిసార్లు అడిగినా "ఆఁ మీ ముగ్గురిని ఇలానే పెంచాను" అని మా నాన్న ఎంతో ఓపికగా బదులిస్తుంటారు.

అమ్మమ్మా, తాతయ్యలకి మనవళ్ళు, మనవరాళ్ళు ఏం చేసినా మురిపెమే. "మా వాడు ఫోన్ విరక్కొట్టాడు బుల్లి" అనో "కోపంతో రిమోట్ విసిరేసాడు" అనో నవ్వుతూ కథలు చెప్పేవారిని చూసి "రెండు దెబ్బలు వెయ్యకపోయావు? ఆ అల్లరేంటి? రాక్షస పిల్లలు" అని మా అమ్మ అనేది (అది నీసా పుట్టకముందు)

"అమ్మా, నా ఫోన్ తీస్కోవా. నీసా కింద పడేస్తుంది" అని అన్నాను.

"పోనీలే. నీసానేగా. చిట్టితల్లి. కొత్త ఫోన్ కొనుక్కుందువులే" అంది.

మా నాన్న ఫ్రెండ్ ఒకాయన హైదరాబాద్ వచ్చినప్పుడు "నేను మా మనవరాలిని బాగా మిస్ అవుతున్నాను. విజయవాడకి వెళ్ళాలంటే దిగులుగా ఉంది" అన్నారు.

"అదే బంధం అంటే అటాచ్ మెంట్స్ పెట్టుకోకూడదు. ఆధ్యాత్మికంలో మొదటి పాఠం వస్తువుల మీద, మనుషుల మీద మమకారం పెంచుకోకూడదు" అని నాన్న చెప్పారు. (అది కూడా నీసా పుట్టకముందే)

"ఊహ నీసాని చూపించమ్మా. ఫేస్ టైం కాల్ చేస్తాను", "ఫోటోలు, వీడియోలు పంపిస్తూ ఉండు మేము వెళ్ళాక", "వీడియోలు అంత కొంచెం సేపు తీస్తావేంటి?" అని ఇప్పుడంటున్నారు.

''పిల్ల దిగులు పడిందనుకుంటా, చాలా చిక్కిపోయింది మనం ఇంకో వారం రోజులు వెళ్ళేసొద్దాం'' అని మా అమ్మ, నాన్న పియోరియాకి వచ్చిన ప్రతీసారి అనుకుంటారు. వాళ్ళ దిగులు నాకు తెలుసు కనక నేను ఎప్పుడూ ఆపలేదు.

ఒకరోజు నేను ఆఫీసు నుండి వచ్చేసరికి మా అమ్మ బాగా దిగులుగా ఉంది. ఎంతసేపటికీ ఫోన్ చూస్తూ బాధగా ఉండడంతో ''నేనేమైనా చేసానా తల్లి? ఎందుకంత డల్‌గా ఉన్నావు? తెలీక తిట్టానా?'' అని అడిగితే తల అడ్డంగా ఊపింది కానీ మాట్లాడలేదు. నేను వెంటనే ఊహకి ఫోన్ చేసి ''ఊహా అమ్మకి పియోరియాలో నచ్చలేదనుకుంటా. రేపు మీ ఇంటికి పంపనా?'' అని అడిగాను.

''ఏమైంది? ఏం చేసావు?'' అని అడిగింది.

''ఏమో నాకు తెలిసి నేను ఏం చెయ్యలేదు. బై మిస్టేక్ ఏమైనా అన్నానేమో'' అని జవాబిచ్చాను.

''ఒకసారి అమ్మకి ఫోన్ ఇవ్వు. నేను మాట్లాడతా'' అంది ఊహ.

ఊహ ఫోన్‌లో ఉందని తెలిసిన మా నాన్న ''నీసాని చూపించమ్మా'' అని అడగడంతో అది వీడియో కాల్ అయ్యింది. నీసాని చూడగానే మా అమ్మ కళ్ళలో నీరు చూసాక ''హమ్మయ్యా. ఊహా! నేనేం చెయ్యలేదు. అమ్మ దిగులు పడింది'' అని ఊపిరి పీల్చుకున్నాను. ఇలాంటి మార్పులు అమ్మమ్మా, తాతయ్యలకే కాక నాలాంటి వారిలో కూడా వస్తాయి. ''అసలు పిల్లలు ఎందుకేడుస్తారో వాళ్ళకే తెలీదు. చెంపమీద ఒక్కటిస్తే నోరుమూసుకుంటారు. పిల్లలు ఎంత డర్టీగా ఉంటారో అసలు. యక్'' అనే నాతో ''నీకు ట్విన్స్ పుట్టాలి లిపి'' అని నా ఫ్రెండ్స్ అనేవారు.

ఇప్పుడు, ''ఊహా, నీసా ఏడ్చేలా ఉంది'', అమ్మ, నీసా ఏడుస్తుంటే పట్టించుకోవేమి?'', ''ఒక్కరోజు పచ్చడి చెయ్యకపోతే ఏంకాదు. నీసా ఆ సౌండ్‌కి భయపడుతుంది'' అనడమే కాక పడుకోపెడితే ఏడుస్తుందని రాత్రంతా భుజాన వేసుకున్న రోజులు కూడా ఉన్నాయి.

ఓ రోజు నీసాని నేను బేబీ సిట్ చేస్తుండగా డైపర్ మార్చాల్సొచ్చింది. ఎలా చేస్తారో ఎన్నడూ చూసి ఎరగను. డబ్బా మీద ఇన్‌స్ట్రక్షన్స్ సరిగ్గా లేవు. యూట్యూబ్‌లో చూద్దామంటే ఫోన్ నీసా చేతిలో ఉంది. సరేలే, ఈజీ అయ్యుంటుంది అని పాత డైపర్ డస్ట్‌బిన్‌లో పడేసాను. కొత్తది వేయడానికి 'అటువైపేమో.. ఇటువైపేమో' అని ఆలోచిస్తూ నీసాని పదిసార్లు అటూ ఇటూ తిప్పాను. నా బాధ కనిపెట్టి ''లైక్ దిచ్, లైక్ దిచ్. దిచ్ వన్' అంటూ నీసానే డైపర్ వెయ్యడం నాకు నేర్పింది.

మా కుటుంబంలో ఉన్న ప్రతివ్యక్తిలో ఓ కొత్తకోణం తన బోసి నవ్వుతో బయటికి తీసింది నీసా. నాసాలో ఉద్యోగం కన్నా నీసాలాంటి మనవరాలే కూతురుపై ప్రేమని పెంచుతుందని కూడా నీసా ద్వారానే తెలుసుకున్నాను.

''పెద్దమ్మ అంటే ఓల్డ్ ఫీలింగ్ వస్తుంది. నేను 'ఆంట్ కావ్య' అని పిలిపిచ్చుకుంటాను'' అన్న కావ్య ''ఎంత ముద్దుగా పిలుస్తుందో కావ్య అని. నేను ఆంటీ కావ్య అని పిలిపించుకుందామనుకున్నాను'' అని ఒకరోజు నాతో అంది.

''ఇంకా చిన్నపిల్లేగా ఇప్పుడు అలవాటు చెయ్యచ్చు'' అన్నాను.

''ఒద్దులే కావ్య అని పిలిస్తే ఏదో తన ఫ్రెండ్ ఫీలింగ్ వస్తుంది. ఆంటీ అంటే దూరం పెరుగుతుంది'' అంది.

నేను రాసుకుంటుండగా ఓ సారి నీసా వచ్చి పెన్‌తో బొమ్మలు గీస్తుండగా నేను తీసిన ఫొటో మా నాన్నకి బాగా నచ్చింది. తన బుక్ (బీ ది బెస్ట్) కవర్ ఫోటోగా వాడాలనుకున్నారు. డిజైన్ పూర్తయ్యాక మా నాన్న ఫోటో పంపి ''ఐ నీడ్ పేరెంట్స్ కాన్ సెంట్ టు పబ్లిష్'' అని ఊహ, నందుకి పంపారు. నిజంగా అవసరమనుకున్నా నందు గంట తిరిగేలోపు అప్రూవల్ లెటర్‌ని పంపి ''లెట్ మీ నో ఇఫ్ ఇట్ వర్క్స్'' అని చెప్పడం మా నాన్నని నవ్వించింది. అలా నీసా మొదటి మోడలింగ్ అసైన్‌మెంట్ తాతయ్య ద్వారా జరిగింది.

చిన్నప్పుడు ఏ పనీ చెయ్యకుండా ఇటు పుల్ల అటు పెట్టని ఊహ, నీసా పుట్టాకే చాలా మారింది. ఇల్లు శుభ్రం చెయ్యడం, వంట చెయ్యడం అతిథుల సౌకర్యాలు చూడడం, మొదలైనవి చూసి నేను బాగా ఆశ్చర్యపోయాను. ''పెళ్ళికి ముందు మీ అమ్మ ఒక్క

పనీ చేసేదికాదు. ఇప్పుడు బుల్లిని చూస్తే నమ్మలేకపోతున్నాను ఎంత పనిమంతురాలయ్యిందో'' అని మా చుట్టాలు చెపితే నమ్మేదాన్ని కాదు. కానీ ఊహని చూసాక అర్థమైంది. కేవలం బంగాళదుంప, ఎగ్స్ మాత్రమే తినే ఊహ ఇప్పుడు బ్రోకలీ, కాబేజీ, దొండకాయలాంటివి కూడా తినడం చూసిన మొదట్లో ''నువు నిజంగానే తింటున్నావా, ఏక్షన్ చేస్తున్నావా'', ''ఊహ ఒకసారి ఇది తినవా. నీ మొహం చూడాలని ఉంది. ఒక్క నిమిషం మళ్ళీ తిను. నేను ఫోటో తీసి దాచిపెట్టుకుంటా'' అని ఎంతో విసిగించేదాన్ని. ''బంగాళాదుంప, ఎగ్స్ తప్ప ఏమీ తినవు బలం ఎక్కడ్నించి వస్తుంది? నీకు పిల్లలు పుడితే ఆలు, గుడ్డు అనిపేర్లు పెడతావేమో'' అని మా అమ్మ తరచూ అనేది. ఆలూ నీసా అయ్యింది. గుడ్డు ఏమౌతుందో చూడాలి.

మా నాన్న రాసిన ఫ్యామిలీ ఆల్బంలో కావ్య స్కూల్లో చేరిన మొదటిరోజు అనుభవాల గురించి రాస్తూ ఆ రోజు కావ్య తిరిగి ఇంటికి వచ్చేంతవరకు పెన్ ముట్టుకోలేకపోయారని రాసారు. క్లాస్‌లో పిల్లల్ని చూసి కావ్య కూడా ఏడవడం మొదలుపెట్టగానే ''ఇవాళ ఇంటికి తీసుకెళ్ళిపోతాను. రేపటినుండి వస్తుంది'' అని టీచర్‌కి చెప్పారట. నీసా విషయంలో కూడా అలానే ఉన్నారు మా నాన్న. ''నీసా తిందో, లేదో ఊహని కనుక్కోమను'' ''అది మధ్యాహ్నాలు పడుకుంటుంది. వాళ్ళకి చెప్పమ్మా ఆడించే ప్రయత్నం చేస్తారేమో'' ''ఈ ఫ్లేవర్ సీరియల్ దానికి నచ్చదు, చెప్పు వాళ్ళకి'' అంటూ నీసా తిరిగి ఇంటికి వచ్చేదాకా ఆయన ఎంత దిగులు పడతారో మాకు తెలుస్తూనే ఉంటుంది. ఒకసారి 'నీసా డే కేర్‌లో బాగా ఏడ్చింది' అని ఊహ చెప్పగానే మా అమ్మా, నాన్నా బాగా కుమిలిపోయి నీసాని ఇంట్లోనే ఉంచమని పట్టుపట్టారు.

''రెండు రోజుల్లో అలవాటైపోతుందిలే'' అని ఊహ ఎంత చెప్పినా ''ఫరవాలేదమ్మా మేము ఉన్నన్ని రోజులైనా దాన్ని ఇంట్లోనే ఉండనివ్వు'' అని మా నాన్న, ''ఏడ్చీ ఏడ్చీ గొంతు పోయింది పాపం'' అని మా అమ్మ అన్నారు.

మొదటిసారి మా నాన్న నీసాని చూసినప్పుడు పాపకి నాలుగురోజులు. ''ఎత్తుకుంటావా నాన్నా?'' అని అడిగాను.

''ఆహా లేదమ్మా స్నానం చెయ్యాలి'' అన్నారు.

స్నానం ముగిసాక ''నాన్నా, ఎత్తుకుంటావా?'' అని అడిగాను.

''ముందు అమ్మకివ్వమ్మా'' అన్నారు.

ఆ తరువాత ''నాన్న, ఎత్తుకుంటావా?'' అని మళ్ళీ అడిగాను.

''లేదమ్మా ఇప్పుడు నిద్దరొస్తుంది'' అని ఆయన గదిలోకి వెళ్ళిపోయారు.

మర్నాడు మళ్ళీ ''నాన్నా, ఎత్తుకుంటావా?'' అని అడిగాను.

''నాకు పిల్లల్ని ఎత్తుకోవడం రాదమ్మా'' అన్నారు.

''అదేంటి? నన్ను చిన్నప్పుడు ఎత్తుకోలేదా?'' అని కోపంగా అడిగాను.

''మీ ముగ్గురినీ ఎత్తుకున్నాను. కానీ నీ తర్వాత ఎవ్వరినీ ఎత్తుకోలేదు. చాలా ఏళ్ళయ్యేసరికి మర్చిపోయాను'' అని చెప్పారు.

''ఓ చాలా ఈజీ నేను చూపిస్తా చెయ్యి ఇలా పెట్టు'' అంటూ మా నాన్నకి పిల్లల్ని ఎత్తుకోవడం నేనే నేర్పానని ఈ రోజుకీ గర్విస్తుంటాను. మొదట రెండు మూడురోజులు మాత్రం మా అమ్మని పక్కనే ఉండమనేవారు.

''అబ్బా, స్టౌవ్ మీద కూర మాడిపోతుంది. బానే ఎత్తుకున్నారుగా. ఏం పడిపోదులే'' అని మా అమ్మ చిరాకుపడేది. (ఇప్పుడు నీసా లేచిన మొదలు మా నాన్న ఒళ్ళోనే ఉంటుంది.)

"డు యు లైక్ కావ్య ఆర్ లిపి?" అని అడిగితే కొన్నిసార్లు కావ్య అని, కొన్నిసార్లు లిపి అని బదులిస్తుంది. కానీ, "డు యు లైక్ తాత ఆర్ మిమ్మీ?" అని అడిగిన ప్రతీసారి 'తాత' అనే బదులిస్తుంది. (ఇది చదివి మా అమ్మ ముఖం టమాటో రంగులోకి మారడం ఖాయం.)

'తాత' అని సుబ్బరంగా పిలుస్తున్నప్పుడు 'అమ్మమ్మ' అని కాకుండా 'మిమ్మీ' ఏంటి? అని అనుకుంటున్నారా? చిన్నప్పుడు నీసా ఊహని 'అమ్మ' అని, మా అమ్మని 'అమ్మమ్మ' అని పిలిచేది. కానీ చిన్నపిల్ల అవ్వడంతో మాటలు సరిగ్గారాని వయసులో 'అమ్మమ్మమ్మ' అని మా అమ్మని, 'అమ్మమ్మ' అని ఊహని రెండు మూడు సార్లు పిలిచింది. "పిల్ల బాగా కన్ఫ్యూస్ అవుతుంది. పోనీ మిమ్మీ అనమను. సులభంగా ఉంటుంది" అని మా అమ్మ సరిపెట్టుకుంది. పోనీ నా పిల్లలు 'అమ్మమ్మ' అని పిలుస్తారేమో అనుకుంటే అది తప్పు. పుట్టని నా పిల్లలు మా అమ్మని ఇటాలియన్ భాషలో 'నోన్నా' అని పిలుస్తారని మొన్నే తీర్మానించాం. ఇంక మిగిలింది కావ్య చేతుల్లో ఉంది.

నీసా డాన్స్ చేసినా, పాటపాడినా, రైమ్స్ చెప్పినా మా నాన్న ప్రతీది వీడియో తీసి భద్రపరుస్తారన్న సంగతి తెలిసిన నీసా "తాత, తాత. కం. సిట్ హియర్" అని మా నాన్నని పిలిచిన తరువాతే ఆటైనా పాటైనా. ఓసారి నెయిల్ పాలిష్ వేసుకున్న నీసా ఎప్పటిలా "తాత, తాత సీ దిచ్" అంటూ మా నాన్న గదిలోకి పరిగెత్తింది. మా నాన్న ఫోన్ తీసి "షో మీ ఎగెయిన్" అంటే "ఓ.కే. బాయ్ ఐం బిజీ" అంటూ పరుగెత్తిన వీడియో నాకు బాగా నవ్వు తెప్పించింది.

ఇంత టెక్నాలజీ లేని రోజుల్లోకూడా (అంటే నా చిన్నప్పుడు) మా నాన్న కుదిరినంత వరకు అన్ని జ్ఞాపకాలు పోగుచేసారు. వందల ఫోటోలు, వీ.సీ.ఆర్‌లో పుట్టినరోజు సెలబ్రేషన్లతోపాటు ఓ బుల్లి టేప్‌రికార్డర్‌లో నాతో తన సంభాషణలు రికార్డ్ చేసి ఆ కాసెట్‌ని నాకు కానుకగా ఇచ్చారు. కేవలం ఆ టేప్స్ ఆధారంగా నేను నిర్ధారించినది - నీసా నా అంత వాగుడుకాయ కాదు.

మా అమ్మ తన తండ్రి గురించి రాసిన ఓ కవిత్వంలో 'తాతయ్యలు ఆడించే పిల్లల్ని చూస్తే నా పిల్లలపై జాలి కలుగుతుంది' అని అర్థం వచ్చేలా ఓ వాక్యం రాసింది. అది చదివిన మొదటిసారి 'తాతయ్యలేరు. నిజమే. కానీ మరీ అంత జాలిపడాల్సిన అవసరం లేదు' అనుకున్నాను. కానీ మా నాన్నని చూసిన తరువాత నామీద నాకే జాలికలిగింది. తాతయ్యలతో ఎన్నో ఏళ్ళుకాదు. కనీసం రెండుమూడురోజులైనా గడపగలిగితే ఎంత బావుండే అనిపించింది.

*(నాన్నకబుర్లు మరిన్ని వచ్చేనెలలో)*

Click here to share your comments on this story